క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

వేములవాడ : వేములవాడ బార్ అసోసియేషన్ అడ్వకేట్లకు బుధవారం ఫార్చ్యూన్ మెడికేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజనికాంత్, అడ్వకేట్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోశాలలో..

వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కోడెలు, గోవులకు ప్రత్యేక మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఈవో రామకృష్ణ బుధవారం తెలిపారు. 15 రోజుల క్రితం నిర్వహించిన హెల్త్‌క్యాంప్ అనంతరం తిరిగి కోడెల ఆరోగ్యస్థితి పరీక్షించేందుకు మరోసారి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వెటర్నరీ అధికారులు, వెటర్నరీ సిబ్బంది, ఆలయ అధికారులు, గోశాల సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. గోశాల నిర్వహణపై కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. జూలై 1న గోశాల నిర్వహణ విధివిధానాలపై అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరుగుతుందన్నారు.

నిధులు మంజూరు


ప్రొసీడింగ్స్ అందిస్తున్న జెడ్పీటీసీ రవి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజలో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలోని బోరు మోటార్‌కు రూ.లక్షా 50వేలు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రొసీడింగ్ కాపీని జెడ్పీటీసీ మ్యాకల రవి బుధవారం గౌడ కులస్తులకు అందజేశారు. మాజీసర్పంచ్ రాజుకుమార్ గౌడ్, బూర బాబు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'ఫీజుల నియంత్రణలో సర్కార్ విఫలం'


ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఏబీవీపీ ఇచ్చిన పాఠశాలల బంద్ బుధవారం విజయవంతమైంది. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డీఈవో, ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శివ, నవీన్, తేజ, కిషన్, అభిలాష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నందుకు నిరసనగా నిర్వహించిన పాఠశాలల బంద్ మండలంలో విజయవంతమైంది. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తీక్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట పాఠశాలల బంద్ నిర్వహించారు.

గంభీరావుపేట: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ మండలంలో విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొండ్ల తిరుపతి, మండల కన్వీనర్ కార్తిక్, మహేందర్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బోనాలు

కోనరావుపేట: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోనియ మర్తనపేటలో బుధవారం బండ్ల బోనాలు తీశారు. గ్రామంలోని అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు వెళ్లి గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కోనరావుపేట: గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ అన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో విత్తన, ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని విత్తన నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. ఆమెవెంట ఏఈవో సహజ ఉన్నారు.

ఏటీఎం లూటీ చేసేందుకు వచ్చిన వ్యక్తి గుర్తింపు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లిలోని ఓ ఏటీఎంలో ఇటీవల దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సదరు దొంగ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?


ఎన్గల్ బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు


ఎన్గల్ గ్రామ శివారులో కోతకు గురైన రోడ్డు

- అధ్వానంగా ఎన్గల్ -మల్రిగడ్డ రహదారి
- రెండేళ్లుగా వాహనదారుల ఇబ్బంది
- పలుసార్లు విన్నవించినా.. పట్టించుకోని అధికారులు

చందుర్తి: మండల కేంద్రానికి వెళ్లేందుకు బండపల్లి, ఎన్గల్ గ్రామాల ప్రజల సౌకర్యార్థం వేసిన తారు రోడ్డు చెదిరిపోయింది. భారీ గుంతలు ఏర్పడి ప్రయాణానికి కష్టంగా మారింది. అయితే సమస్యపై పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రతిపాదనలు పంపించామని చెబుతూ దాటవేస్తున్నారు. రెండేళ్లుగా ఈ రోడ్డుపై గుండా ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారసులు పలుగ్రామాలు ప్రజలు వాపోతున్నారు.

రెండు మండలాల ప్రజలకు ఉపయోగకరం

మండల పరిధిలోని బండపల్లి, ఎన్గల్ గ్రామాల ప్రజలతో పాటు కోనరావుపేట మండలం బావుసాయిపేట, వట్టిమల్ల, కొండాపూర్, వెంకట్రావుపేట, కోనరావుపేట గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. ఈ ప్రాంత ప్రజల రవాణా సౌకర్యం కోసం 2007లో రూ.32.50లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. రెండేళ్లగా భారీ వర్షాలకు తారురోడ్డంతా చెదిరిపోయింది. అయినా అధికారులు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలకు తిప్పలు తప్పడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రవాణాకు దూరం

రెండు గ్రామాల మధ్య తారు రోడ్డు చెదిరిపోవడంతో కనీసం పాదచారులు నడిచేందుకు వీలులేకుండా పోయింది. కిలో మీటర్ల మేర రోడ్డు చెదిరిపోవడంతో ఆటోలు, బస్సులు నడవకపోవడంతో రవాణా సౌకర్యాలకు దూరమవుతున్నారు. ఈ గ్రామాలపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం కష్టంగా మారింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పంచాయతీరాజ్ శాఖ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్గల్‌లోని బైపాస్ రోడ్డు అరకిలో మీటర్‌కు పైగా చెదిరిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఎన్గల్ నుంచి మల్రిగడ్డ వరకు గల 3.2 కిలో మీటర్ల రోడ్డు పొడవునా గుంతలు ఉన్నాయి.

కాలినడకనే..

దారి పొడవునా గుంతలు ఉండటంతో ఆర్టీసీ సేవలకు ప్రజలు దూరమయ్యారు. బస్సులు నడిపిందుకు ఆర్టీసీ అధికారులు ససేమిరా అంటున్నారు. దీంతో ప్రయాణికులకే కాకుండా మండల కేంద్రానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఆటోలకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వ్యయ ప్రయాస కోర్చి వేములవాడ పట్టణం మీదగా మండలకేంద్రానికి తిరిగొస్తున్నారు.

కోతకు గురవుతున్న రోడ్డు

రెండేళ్లుగా భారీ వర్షాలకు రోడ్లకిరువైపులా మట్టి కోతకు గురైంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తారు చెదిరి ఓ వైపు ఇబ్బంది పడుతుంటే మరో వైపు కోతకు గురైనా రోడ్డుపై సైడ్ తీసుకునేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కంకర తేలింది



తారురోడ్డు చెదిరి రోడ్డుపైన కంకర తేలింది. గుంతలు ఏర్పడటంతో ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సును రెండేళ్ల క్రితం నుంచి బంద్ చేశారు. ఎప్పుడైనా మండలకేంద్రానికి వెళ్లాలంటే మహిళా సంఘాల సభ్యులు అయితే కాలినడకన, వేములవాడ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. వెంటనే రోడ్డుపై అధికారులు మరమ్మతులు చేయాలి.

– కుసుంబ జనార్దన్, యువకుడు, ఎన్గల్

పట్టించుకోవడం లేదు



ఎన్నికప్పుడే వచ్చారంటే నాయకులు తర్వాత ఇటు వైపు చూడటం లేదు. తమ సమస్యలను ఎవరికైనా చెప్తామంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. వేములవాడ, చందుర్తికి ఎటూ వెళ్లాలన్నా ఎన్గల్ బైపాస్ నుంచి వెళ్లాలి. 500 మీటర్ల దూరంలో దాదాపు వంద గుంతలు ఉన్నాయి. ప్రస్తుతం బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– గడ్డం కుర్మ రాయమల్లయ్య, రైతు, బండపల్లి

ప్రతిపాదనలు పంపాం



ఎన్గల్-మల్రిగడ గ్రామాల మధ్య తారు రోడ్డు ఛిద్రమైంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరైతే తారు రోడ్డు నిర్మాణంతో పాటు సైడ్ బర్మ్స్ నిర్మాణం చేపడుతాం. నిధుల మంజూరుకోసమే ఎదురుచూస్తున్నాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ, ఏఈ, చందుర్తి

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి


వేములవాడరూరల్: ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: ఉపాధ్యాయ పదోన్నతుల్లో బీఈడీ చేసి ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వేములవాడ ఎంఈవో బన్నాజీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బీఈడీ ఉపాధ్యాయులు దాదాపు 20 ఏళ్లుగా ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. బీఈడీ ఎస్జీటీలకు సహజ న్యాయ సూత్రాలకు లోబడి పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. 12 ఏళ్లు పూర్తిచేసుకున్న ఎస్జీటీలను ఎస్‌ఏలుగా ప్రమోట్ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు రవీందర్, చక్రపాణి, కృష్ణహరి, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాంగోపాల్, నరేశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: బీఈడీ ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని ప్రాథమిక స్థాయి బోధనార్హత కోల్పోయిన బీఈడీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి, ఎంఈవోకు వినతిపత్రం అందించారు. పీఎస్‌లలో పనిచేస్తున్న బీఈడీ ఎస్జీటీలను కాలయాపన లేకుండా ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు. 12 ఏళ్లు పూర్తి చేసిన ఎస్జీటీలందరినీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోట్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు సుధీర్, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అంజయ్య, సతీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీఈడీ చేసిన ఉపాధ్యాయులకు ఎల్‌ఎఫ్‌ఎల్ (లోయెస్ట్ ఫీమల్ లిటరసీ) హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలని ఎస్జీటీ సీనియర్ ఉపాధ్యాయుడు టి.రామలింగా రెడ్డి డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో ఎమ్మార్సీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మిగిలిన ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుల్లో బీఈడీ చేసిన వారికి అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఇల్లంతకుంట కాంప్లెక్స్ హెచ్‌ఎంకు కూడా వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయులు జయకృష్ణ, మధు, వెంకటేశం, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పుష్పలతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని, ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేయాలన్నారు. కల్యాణం అనిల్, రాజశేఖర్ తదితరులున్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ : యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని టౌన్ సీఐ వీరప్రసాద్ అన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, బోయినపల్లి పోలీస్‌స్టేషన్లలో పరిధిలో గంజాయి పట్టుబడిన వారికి, వారి తల్లిదండ్రులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, పృథ్వీధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల అపరిశుభ్రతపై ఆగ్రహం


చెత్తను తొలగిస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో అంబేద్కర్ కూడలి ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, చెతను తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు చెత్తాచెదారాన్ని స్వయంగా తొలగించారు. కార్యక్రమంలో నాయకులు ఎగదండి స్వామి, లక్కం బాబు, వెంకటరాజం, బాలయ్య, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం.. నిరుపేద విద్యార్థులకు వరం



ధర్మారంలోని వసతి గృహం

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాలు నిరుపేద విద్యార్థులకు వరంగా మారుతున్నాయి. నిరుపేద విద్యార్థులు పైచదువుల్లో రాణించేందుకు వసతి గృహాలు దోహదపడుతున్నాయి. రుచికరమైన భోజనంతోపాటు స్టడీ మెటీరియల్, అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందిస్తుండటంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు వసతిగృహంలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వసతి.. మెటీరియల్స్

మండలంలోని ధర్మారంలోని ఈ వసతి గృహంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వందమంది విద్యార్థులకు సరిపడా సొంత భవనం ఉంది. ఇప్పటికే వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. మరో 45 మంది చేరేందుకు ఖాళీలు ఉన్నాయి. విద్యార్థులకు ఉచిత వసతితోపాటు స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగు, కార్పెట్, బెడ్ షీట్, నాలుగు జతల దుస్తులు, షూలు, అందించనున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



2024 – 25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుకునే బాలురు ఈ వసతి సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తిగల విద్యార్థులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు–3, కుల, ఆదాయ, రేషన్, ఆధార్ కార్డు ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులను వెంట తెచ్చుకోవాలి. జిల్లాలోని ఏ మండలానికి చెందిన విద్యార్థులైనా వసతి గృహంలో చేరేందుకు అవకాశం ఉంది.

– శ్రీనివాస్, వార్డెన్, ధర్మారం

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కోనరావుపేట: చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న మిత్రుడు మృతిచెందగా బాధిత కుటుంబానికి చేయూతనందించారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2002-02 సంవత్సరంలో ప దో తరగతి చదువుకున్న దండు దేవరాజు అనారోగ్యంతో మృతిచెందాడు. తో టి స్నహితులు తలాకొంత జమచేసి రూ. 63, 500లను మృతుడి పిల్లల పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ అందజేశారు. పూర్వ విద్యార్థులను బెండ శ్రీనివాస్, నరేశ్, కిరణ్, నాగరాజు తదితరులు అభినందించారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం


మైత్రికి చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

తంగళ్లపల్లి: మండలంలోని బద్దనపల్లి పీఎం శ్రీ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీలో రాష్ట్ర ర్యాంకు సాధించిన విద్యార్థిని దాసరి మైత్రిని బుధవారం అధ్యాపకులు అభినందించారు. వంద మార్కులకుగాను 989 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ దర్శనాల పద్మ పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకల విద్యాలయాల సంస్థ రాష్ట్ర సెక్రటరీ రూ.15 వేల చెక్కును పంపగా మైత్రికి చెక్కు అందించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


ముస్తాబాద్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ , విద్యార్థులు


వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసులు


కోనరావుపేట: విద్యార్థుల మానవహారం

- సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్

ముస్తాబాద్: యువత ఉన్నత లక్ష్యంతో ఎదగాలని, మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మాట్లాడుతూ కొందరు అధిక సంపాదన ఆశపడి గంజాయి, డ్రగ్స్, స్మోకింగ్ లాంటివి అలవాటు చేస్తారని, చదువుపై దృష్టిసారించి జీవితంలో ఎదగాలన్నారు. ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలో డ్రగ్స్ నిర్మూలనపై సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు వేములవాడ ర్యాలీ నిర్వహించారు.

వేములవాడరూరల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ వెంకటేశ్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో జాతీయ డ్రగ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ఎస్సై రమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో విద్యార్థులు, యువకులకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని ఆదర్శ, ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు ర్యాలీతీసి మానవహారం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై దూలం పృథ్వీధర్‌గౌడ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, బిల్ల ఆనందం తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి చందుర్తి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎక్సైజ్‌శాఖ, పోలీస్‌శాఖ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఏఎస్సై రాజిరెడ్డి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ నుంచి హనుమాన్ ఆలయం వరకు ర్యాలీతీశారు.

రుద్రంగి: అంతర్జాతీయ మాదక ద్యవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఎస్సై సిరిసిల్ల అశోక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ తీశారు. కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారి ఇందిరాచౌక్‌లో మానవహారం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

- **ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ**



వేములవాడ: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, అంజని ప్రసాద్, మహిపాల్‌రెడ్డి, అనిల్‌రావు, కిరణ్‌రావు, కిషన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజు బుధవారం పరామర్శించారు. అనంతరం ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- **గంభీరావుపేట:** చొప్పదండి ఎమ్మెల్యే సత్యంను మండలానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు కొండూరు గాంధీబాబు పరామర్శించారు. సత్యం సతీమణి ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

- **విజయవంతం చేయండి**

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల అయ్యప్ప గురుస్వాములు, స్వాములు ఆగస్టు 4న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించే అఖండ భజన సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏబీఏడీపీఎస్ గౌరవ అధ్యక్షుడు రాజు గురుస్వామి కోరారు. ఎల్లారెడ్డిపేటలో అయ్యప్ప స్వాములు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీను గురుస్వామి, జిల్లాలోని ప్రతినిధులు పాల్గొన్నారు.

- **మంత్రి పొన్నంపై ఆరోపణలు సరికాదు**

ముస్తాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. పర్యావరణశాఖ మార్గదర్శకాలు, నిబంధనల మే రకు ఫ్లైయాష్ తరలిస్తున్నా అందులో అవినీతి జరి గిందంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన కౌశిక్‌రెడ్డి తన బండారం బయట పడుతుందనే మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

- **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

ఎల్లారెడ్డిపేట: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణానికి చెందిన ఈసరి శశికుమార్ అనే యువకుడు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఇసుక ట్రాక్టర్ నడుపుతున్నాడన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఆర్డీఏ వద్దకు తరలించినట్లు తెలిపారు. మైనర్లకు ఇసుక ట్రాక్టర్లు ఇచ్చే యాజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

- **వ్యాసరచన పోటీలు**

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

- **యువకుడికి గాయాలు**

ముస్తాబాద్: ముస్తాబాద్, సిద్దిపేట ప్రధాన రహదారిపై వాహనం అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలయ్యాయి. మొర్రాపూర్‌కు చెందిన సంతోష్ బైక్‌పై ముస్తాబాద్ నుంచి ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.